ANDHRAJYOTHY

# ఆంధ్రజ్యోతి



# పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★ శనివారం 17 ఆగస్టు 2024



- ఐదేళ్లుగా హాస్టళ్లు, గురుకుల విద్యార్థుల వెతలు
- విద్యార్థులకు అందని నాణ్యమైన భోజనం
- గతేడాది పెంచినా అమలు కాని వైనం

# మెస్ చార్జీలు పెరిగేదెప్పుడో?

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రభుత్వ వసతిగృహాలు, గురు కుల విద్యాలయాల్లో చదువు ుతున్న విద్యార్థులు మెస్ చార్జీలు పెరగక ఐదేళ్లుగా ఇబ్బందులు పడుతు న్నారు. ఎప్పుడో పెంచిన మెస్ చార్జీలో ఇప్పటి వరకు అమలవుతు న్నాయి. గడిచిన ఐదేళ్లలో నిత్యావసర వస్తువులు, కూరగాయలు, కిరాణ సరుకులు రెండు, మూడింతలు పెరిగినా కూడా విద్యార్థులకు ఇచ్చే మెస్ చార్జీలు మాత్రం పెరగడం లేదు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం లభించడం లేదు. ఫలితంగా విద్యార్థులు శారీరకంగా ఎదగడం లేదు. గత ఏడాది మార్చిలో అన్ని విభాగాల్లోని వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఇచ్చే మెస్‌చార్జీలను 25 శాతం పెంచుతున్నామని అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీంతో విద్యార్థులు ఎంతో సంబరపడ్డారు. కానీ ఆ ప్రకటన మాటలకు, కాగితాలకే పరిమితం అయ్యిందే తప్ప అమల్లోకి రాలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పటి వరకు అంతంత మాత్రంగానే ఉన్న గురుకుల విద్యాలయాల సంఖ్యను పెంచింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు చొప్పున బీసీ గురుకులాలు, ఒక మైనార్టీ, రెండు ఎస్సీ గురుకులాల విద్యాలయాలను ఏర్పాటు చేసింది. వీటితో పాటు సాధారణ వసతి గృహాలు, కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయాల్లో చదివే విద్యార్థులకు ఉద యం పూట టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం, సాయంత్రం స్నాక్స్, పాలు, టీ అందజేసేందుకు ప్రభుత్వం మెస్ చార్జీలతో పాటు రూపాయికే కిలో బియ్యం అందజేస్తుంది.

- నాణ్యత లేని సరుకులు సరఫరా..

ప్రభుత్వం ఇచ్చే మెస్ చార్జీలతో విద్యార్థులకు వంట చేసేందుకు గ్యాస్, కూరగాయలు, మాంసం, కోడిగుడ్లు, పండ్లు, కిరాణ సరుకు లను కొనుగోలు చేసి నిర్దే శించిన మెనూ ప్రకారం భోజనాలు, టిఫిన్లు, స్నాక్స్ పెట్టాల్సి ఉంటుంది. 3 నుంచి 7వ తరగతి చదువు తున్న విద్యార్థులకు 950 రూపాయలు, 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యా ర్థులకు 1100 రూపాయలు, ఇం టర్, డిగ్రీ, ఆపై చదువులు చదువు తున్న విద్యార్థులకు నెలకు 1500 రూపాయలు అందజేస్తున్నారు. గత ఏడాది ఈ చార్జీలను 25 శాతానికి పెంచుతామని ప్రకటించారు. ఆ మేరకు 3 నుంచి 7వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 1200 రూపాయలు, 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 1400 రూపాయలు, ఇంటర్, డిగ్రీ, ఆపై చదువులు చదువుతున్న విద్యార్థులకు నెలకు 1875 రూపాయలు అందజేస్తామని ప్రకటించింది. కానీ అమల్లోకి తీసుకరాలేదు. చాలీ చాలని మెస్ చార్జీలు అందజేయడం వల్ల తక్కువ ధరలకు నాణ్యమైన సరుకులను సరఫరా చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. బలవంతంగా కాంట్రాక్టులు పొందుతున్న వాళ్లు నాణ్యత లేని సరుకులను సరఫరా చేస్తున్నారు. వాటితో చేసిన వంట తినేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మెస్ చార్జీలను వెంటనే పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## రామగిరి ఖిల్లాను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



రామగిరి ఖిల్లా మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రామగిరి ఖిల్లాను పర్యాటకప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి ఆయన రామగిరి ఖిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఖిల్లా పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూపొందించిన ప్రణాళికలు, ఖిల్లా చరిత్ర, ప్రాముఖ్యత తదితర అంశాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యాటకంగా రామగిరి ఖిల్లా అభివృద్ధి చేసేందుకు వీలుగా బేగంపేట నుంచి రోడ్డు ఏర్పాటుచేయాలని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి శివయ్య, ఈఈ పంచాయతీరాజ్ గిరిష్‌బాబు, రామగిరి తహసీల్దార్ రాంచందర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఆన్‌లైన్ ద్వారా ఇసుక బుకింగ్ : కలెక్టర్

పెద్దపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్యాండ్ టాక్సీ ద్వారా ఇసుక సరఫరాకు ఆన్‌లైన్ బుకింగ్ ప్రక్రియ ఆగస్టు 17నుంచి ప్రారంభమవుతుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల, గట్టెపల్లి ఇసుకరీచ్‌ల నుంచి స్యాండ్ టాక్సీ(మన ఇసుక వాహనం) విధానాన్ని ప్రారంభిస్తున్నామని, జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, ధర్మారం, జూలపల్లి, ఎలిగేడు, ఓదెల మండలాల ప్రజలకు స్యాండ్ టాక్సీ ద్వారా ఇసుక సరఫరా చేస్తామని తెలిపారు. పెద్దపల్లి, సుల్తానాబాద్, ధర్మారం, జూలపల్లి, ఎలిగేడు, ఓదెల మండలాల ప్రజలు ఇసుక సరఫరా కోసం ఈనెల17నుంచి ఆన్‌లైన్ స్యాండ్ ట్యాక్సీ వెబ్‌సైట్‌లో బుకింగ్ చేసుకోవాలని, ఇసుక బుక్ చేసిన 48 గంటలలోగా డెలివరీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఒక టన్నుఇసుక సరఫరా కోసం ఓదెల మండలానికి 1900 రూపాయలు, కాల్వశ్రీరాంపూర్ మండలానికి 1900 రూపాయలు, పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి 1900రూపాయలు, పెద్దపల్లి మండలం సబితం గ్రామానికి 2100రూపాయలు, జూలపల్లి మండలానికి 2100 రూపాయలు, ధర్మారం మండలానికి 2100రూపాయలు, పెద్దపల్లి మండలానికి 1750 రూపాయలు, ఎలిగేడు మండలానికి 1750 రూపాయలు, సుల్తానాబాద్ మండలానికి 1100 రూపాయలకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు. మన ఇసుక వాహనం వెబ్‌సైట్‌లో బుకింగ్ చేసుకున్న లబ్ధిదారులకు సోమవారం నుంచి ఇసుక డెలివరీ ప్రారంభిస్తామని తెలిపారు. మన ఇసుక వాహనం కాల్ సెంటర్‌ను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశామని, ఇసుక బుకింగ్‌లో ఇబ్బందులు ఎదురైతే కాల్ సెంటర్ 08728223310, 08728223318 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని, ఇతర సమాచారం కోసం ఇన్‌చార్జి అధికారి కె శ్రీనివాస్ 9515977538 సెల్‌ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## నేడు పెద్దపల్లిలో వైద్య సేవలు బంద్

పెద్దపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన దారుణ సంఘటనకు నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఐఎంఏ పెద్దపల్లి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రమాకాంత్, డాక్టర్ ప్రణీత్ విలేకరులకు తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ 17న శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు 24గంటల పాటు తమ సేవలు బంద్ చేస్తున్నామని పేర్కొన్నారు. డాక్టర్లపై జరుగుతున్న దాడులకు నిరసనగా తాము శాంతియుతంగా చేసే బంద్‌కు ప్రజలు, పేషెంట్లు సహకరించాలని కోరారు. సమావేశంలో డాక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ మల్లేశం, డాక్టర్ రాజేష్, డాక్టర్ లక్ష్మణ్‌రావు, డాక్టర్ స్వరూప్ కిరణ్, డాక్టర్ నిషాంత్, డాక్టర్ కిరణ్, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

### రామగుండంలో...

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 16: కోల్‌కతాలో వైద్యురాలి హత్యను నిరసిస్తూ శనివారం గోదావరిఖనిలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు బంద్ పాటించనున్నారు. ఉదయం 6 గంటలనుంచి సాయంత్రం 6గంటల వరకు వైద్యసేవలను నిలిపివేస్తున్నట్టు వైద్యులు తెలిపారు. హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం పట్టణంలో వైద్యులు ర్యాలీ నిర్వహించనున్నారు. అత్యవసర సేవలు యధావిధిగా కొనసాగుతాయని, ఓపీ ఉండదని పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు ఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి వైద్యులు ర్యాలీ నిర్వహించనున్నారు.

## మంథని ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

పెద్దపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మంథని సివిల్ హాస్పిటల్‌లో పనిచేసే కాంట్రాక్టు వర్కర్ విష్ణుభక్తుల పూర్ణిమతో బూట్లు తుడిపించుకున్న హాస్పిటల్ సూపరింటెండెంట్ రాజశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని బాధితురాలితో కలిసి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జి జ్యోతి శుక్రవారం కలెక్టర్ ఫిర్యాదు చేశారు. ఆగస్టు 15న జెండా వందనం అనంతరం హాస్పిటల్‌లో అందరూ ఉద్యోగులు ఉండగా కాంట్రాక్టు వర్కర్ పూర్ణిమను పిలిచి బూట్లలో ఇసుక ఉందని శుభ్రం చేయాలని ఆదేశించారు. దీంతో ఏమి చేయాలో తెలియక ఆ బూట్లు తుడిచానని, స్వాతంత్ర దినోత్సవం రోజే తనను అవమానించిన సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈసందర్భంగా జ్యోతి మాట్లాడుతూ మంథనిసివిల్ హాస్పిటల్ అధికారి రాజశేఖర్ కాంట్రాక్టర్ ఉద్యోగితో వ్యవహరించిన తీరు అవమానకరమని, ఈ విషయమై విచారణ జరిపి అతడిపై చర్యలు కలెక్టర్‌ను కోరారు.

## 20న ఉపకరణాల గుర్తింపు శిబిరం

పెద్దపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యారుల కోసం ఈనెల20న పెద్దపల్లి మండల వనరుల కేంద్రం ఆవరణలో ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని నిర్వహించనున్నామని డీఈవో డి మాధవి తెలిపారు. శిబిరానికి జిల్లాలోని 18ఏళ్లలోపు దివ్యాంగ బాలబాలికలు హాజరుకావాలని పేర్కొన్నారు. భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ(అలిమ్కో) నుంచి వచ్చిన డాక్టర్ల బృందం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వివరాలకు మండల విద్యా సమన్వయకర్తలను గానీ, జిల్లా విద్య సమన్వయకర్తను గానీ, 9246462324 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. శిబిరంలో గుర్తించిన వారికి 3 నెలల్లో సహాయ ఉపకరణాలు అందజేస్తామని పేర్కొన్నారు.

# భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతం



గోదావరిఖని కోదండ రామాలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతం..



ఓదెలలో..



సుల్తానాబాద్‌లో..

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 16: గోదావరిఖనిలో వరలక్ష్మీవ్రతం వేడుకలు శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇంటింటా మహిళలు వరల క్ష్మీ వ్రతాలు చేసుకోవడంతో పాటు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. స్థానిక కోదండ రామాలయంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో వందలాది మంది మహిళలు పాల్గొని పూజలు చేశారు. ఆలయ అర్చకులు మధుసూధనచార్యులు, శశిధరచార్యుల మంత్రోచ్చరణల మధ్య వరలక్ష్మీవ్రతం కార్యక్రమం కొనసాగింది. అలాగే పలు ఆలయాల్లో కూడా సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహించారు. అనంతరం మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

**సుల్తానాబాద్ :** పవిత్రమైన శ్రావణమాసంలో వచ్చిన శ్రావణ రెండో శుక్రవారం, వరలక్ష్మి వ్రతం వంటి వేడుకలను మహిళలు వైభవంగా జరుపుకున్నారు. మహిళలు తమ నివాస గృహాలను అందంగా అలంకరించుకుని మంగళప్రదమైన వరలక్ష్మి అమ్మ వారి వ్రతాన్ని నోముకున్నారు. ఇంటికి వచ్చిన ముత్తైయిదువలకు పసుపు, కుంకుమ, పండ్లు వంటివి వాయినంగా ఇచ్చి వారి ఆశీస్సులు పొందారు. పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేకపూజలు అర్చనలు చేశారు. సుల్తానాబాద్, కనుకుల తదితర దేవాలయాల్లో సామూహిక కుంకుమార్చనలు చేశారు.

**ఓదెల :** మండల కేంద్రంలోని పార్వతి శంభు లింగేశ్వర స్వామి (శివాలయం) పొత్కపల్లి భవాని సహిత మహాలింగేశ్వర స్వామితో పాటు తదితర క్షేత్రాల్లో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు, పూజలను నిర్వహించారు. శివునికి అభిషేకాలు నిర్వహించి అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించిన అనంతరం మహిళలంతా ఘనంగా పూజలు,అభిషేకాలు నిర్వహించారు. అలాగే భ్రమరాంబ మల్లికార్జున స్వామి ధర్మకర్తల మండలి సభ్యుడు కనికిరెడ్డి సతీష్ శివాలయానికి స్వాగత తోరణాన్ని వితరణ చేశారు. అనంతరం ఆలయానికి వితరణ చేసిన దాతలను సతీష్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు ధూపం నాగేందరయ్యా, దాతలు శ్రీపతి మహేష్, రామంచ రామకృష్ణ, తాటికొండ రాజ్ కుమార్, రాజయ్య, ముద్దసాని అనిల్, కాసారపు రాజు, రాజేశం, సాగర్ పాల్గొన్నారు.

**మంథని :** శ్రీమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని భక్తులు వైభవంగా పూజలు చేశారు. గర్భాలయంలోని అమ్మవారిని దర్శించుకొని అర్చనలు చేశారు. ఓడిబియ్యం, పూజలు, గాజులు, సుగంధద్రవ్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేద పండితులు మారుపాక ప్రశాంత్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయ అవరణలో మహిళలు అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని నయనమనోహరంగా వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. రాత్రి ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి ఆలయంలో కనిపించింది.



మంథనిలో భక్తుల పూజలు..



రామగిరిలో..

**రామగిరి :** మండలంలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మి పూజలు మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. అత్యంత పవిత్రమైన శ్రావణమాసం సందర్భంగా పవిత్ర స్నానాలు ఆచరించిన మహిళలు వరలక్ష్మి నోములను నోముకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

## ఆర్ఎంపీలతో డీఎంహెచ్‌వో సమావేశం

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 16: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్ శుక్రవారం జిల్లాలోని ఆర్ఎంపీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీలు వారి పేరు ముందు డాక్టర్ అని పెట్టరాదని, వారి క్లీనిక్‌లలో ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే రాయించాలని, ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, ప్రిస్క్రిప్షన్ రాయడం గానీ, ల్యాబ్ టెస్టులు రాయడం గానీ చేయరాదన్నారు. అలాగే ప్రైవేట్ హాస్పిటల్ డాక్టర్స్‌తో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రైవేట్ హాస్పిటల్‌లను ఉద్దేశించి మాట్లాడారు. తప్పకుండా రిజిస్ట్రేషన్, రెన్యూవల్ చేయించుకోవాలని, హాస్పిటల్స్ ప్రభుత్వ గైడ్ లైన్స్ ప్రకారం నడపాలన్నారు. అన్ని హాస్పిటల్స్‌లలో ఇంగ్లీష్, తెలుగులో టారిఫ్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ రేట్స్ ప్రకారమే ఫీజులు తీసుకోవాలన్నారు. దీంతో నివారణ చర్యలను త్వరితగతిన చేపట్టవచ్చన్నారు. అన్ని ర్యాపిడ్ పాజిటివ్ కేసులు డెంగ్యూ కేసులు కావని, అనుమానిత కేసులను ఎలిసా టెస్ట్‌కు పంపాలని సూచించారు. ప్రభుత్వ టీ హబ్ డయాగ్నొస్టిక్స్‌లో డెంగ్యూ నిర్ధారణ చికిత్స ఉచితంగా చేస్తారని. సమీపంలోని ఆసుపత్రి యందు సంప్రదించి బ్లడ్ శాంపిల్స్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన విధానాలకు వ్యతిరేకంగా ప్రవేట్ హాస్పిటల్స్‌లు నడిపిన యెడల చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న కుమారి, డాక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సుల్తానాబాద్, ఆగస్టు 16: సీజనల్ వ్యాధుల వ్యాప్తి జరుగుతున్న నేపద్యంలో అప్రమత్తంగా ఉండాలని తగు నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆదేశించారు. సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ కస్తూర్బా బాలికల కళాశాలను డీపీవో శుక్రవారం ఉదయం తనిఖీ చేశారు. కిచెన్ షెడ్‌తో పాటు స్కూల్‌లోని అన్ని విభాగాలను పరిసరాలను పరిశీలించారు. టీచర్ల సిబ్బంది హాజరుపట్టికను చూశారు. కిచెన్ షెడ్డును పరిశీలిస్తూ బాలికలకు అందించే తాగునీరు, ఆహారం కలుషితం కాకుండా చర్యలు జాగ్రత్తలు తీసుకోవాలని, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. స్పెషల్‌ఆఫీసర్ గురించి ఆరా తీయగా ఆమె సెలవులో ఉందని చెప్పడంతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

## 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పరిశీలన

అంతర్గాం, ఆగస్టు 16: రామగుండంలో కొత్తగా 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణం కోసం శుక్రవారం జెన్‌కో డైరెక్టర్లు రామగుండంలో భూమి పరిశీలన చేశారు. జెన్‌కోకు చెందిన 62.5 మెగావాట్ల పాత థర్మల్ విద్యుత్ కేంద్రంకు సంబంధించి విస్తరణపై హైదరాబాద్ నుంచి వచ్చిన జెన్‌కో సివిల్, హెచ్‌ఆర్ డైరెక్టర్లు సచ్చితానంద, అజయ్ కుమార్, ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ పీవీ శ్రీనివాసులు బీ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సందర్శించి ప్లాంట్ విస్తరణను పరిశీలించారు.

అనంతరం యాష్‌పాండ్ నిర్మాణంకు జెన్‌కో స్థలాలను పరిశీలించారు. ఇక్కడి జెన్‌కోకు చెందిన పాత బీ థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో తరచూ సాంకేతిక లోపం తలెత్తి విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుంది. ఈ క్రమంలో జెన్‌కో డైరెక్టర్లు రామగుండంలో భూ సర్వేకు రావడంతో రామగుండంలో కొత్త ప్లాంట్ ఏర్పాటుకు అడుగులు పడినట్లు తెలుస్తోంది. డైరెక్టర్ల వెంట బీ థర్మల్ విద్యుత్ కేంద్రం ఎస్ఈ పీ విజేందర్, డీఈలు డీ శంకరయ్య, కే శ్రీనివాసరావు, సూర్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

# రుణమాఫీపై కాంగ్రెస్ నేతలు చర్చకు రావాలి

- వంద శాతం రుణమాఫీ చేయని సీఎంపై చీటింగ్ కేసు పెట్టాలి - మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్, కోరుకుంటి చందర్

పెద్దపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం 100 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని, ఈ విషయమై దమ్ముంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊర్లకు చర్చకు రావాలని మంథని, రామగుండం మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్, కోరుకంటి చందర్ సవాల్ విసిరారు. వందకు వందశాతం రుణమాఫీ చేయని సీఎం రేవంత్ రెడ్డిపై పోలీస్ స్టేషన్లో కేసులు పెట్టాలని వారు రైతులకు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ విషయమై కాంగ్రెస్ ప్రభుత్వం 110 ఆంక్షలు పెట్టి, 100 శాతం మంది రైతులకు రుణమాఫీ చేసినట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి నా అంత సిపాయి లేనట్లుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆయన స్థాయికి తగ్గట్లుగా కాకుండా నీచమైన రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి మాట్లాడితే గొప్పగా మాట్లాడాలని అలాంటి పరిస్థితి రాష్ట్రంలో లేదని అన్నారు. తుపాకి రాముడు మాటల్లాగా కూడా లేవని ఆయన మాటలు వింటే ఏడుపు వస్తుందని, అసహనం పెరిగేలా ఉన్నాయని, ఈ రాష్ట్రం ఉంటుందా, పోతుందా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఒక దిశ దశ చూపకుండా కేవలం కేసీఆర్, కేటీఆర్‌లనే తిట్టడమే రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. దీనిని చూస్తూ ప్రజలు ఊరుకోరని అన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ వందకు వంద శాతం కాలేదని, ఇది రైతుల ఆమోదం పొందలేదని అన్నారు ఈ విషయమై రైతులు కళ్లల్లో నీళ్లు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు రుణమాఫీ చేయని రైతులకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. రుణమాఫీ చేశామని గొప్పగా చెబుతున్న ముఖ్యమంత్రి కాకుండా, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎవరైనా దమ్ముంటే గ్రామాల్లోకి రైతుల ముందుకు రావాలని వారు సవాలు విసిరారు. ఒక ఉచిత బస్సు తప్ప, ఏ ఒక్క పథకం రాష్ట్రంలో అమలు కావడంలేదని మండిపడ్డారు. ఈ రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని, ఆ పార్టీ దేశానికి పట్టిన శని అని వారు విమర్శించారు. అబద్ధాల పునాదుల మీద ఏర్పడ్డ కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తున్నదని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రుణమాఫీ పేరిట ప్రజలను రైతులను మోసం చేశారని అన్నారు. రెండు లక్షల రుణమాఫీ కోసం మొదట 40 వేల కోట్లని ఆ తర్వాత 31 వేల కోట్లని మాయమాటలు చెప్పి, ఇప్పుడు 17,500 కోట్ల రూపాయలు మాత్రమే రుణమాఫీ చేసి మోసం చేశారని అన్నారు. రుణమాఫీపై మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డిపై స్థానిక పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టాలని రైతులకు వారు పిలుపునిచ్చారు. 9 నెలల్లో ఎన్ని కోట్లు అప్పులు తీసుకొచ్చి ఏమేమీ చేశారు ప్రజలకు వివరించాలన్నారు. మహిళలకు నెలకు 2500, నెలకు 4వేల పింఛన్లు, రైతుబంధు ఏమైందని ప్రశ్నించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్, కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట మధూకర్

ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ గంటా రాములు యాదవ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, పార్టీ నాయకులు బొడ్డు రవీందర్, అడవ శ్రీనివాస్, చెలకలపల్లి శ్రీనివాస్, నూతి తిరుపతి, జక్కుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మానకొండూర్, ఆగస్టు 16: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మానకొండూర్‌లో శుక్రవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని వెల్ది గ్రామంలోని మానేరువాగు నుంచి కరీంనగర్‌కు ఇసుకను రవాణా చేస్తుండగా పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమాని చంద్, రాకేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

## సింగరేణి కార్మికుడి అదృశ్యం

జ్యోతినగర్, ఆగస్టు 16 : అన్నపూర్ణకాలనీకి చెందిన ధర్మల రామ్మోహన్ (45) అనే సింగరేణి కార్మికుడు అదృశ్యమయ్యాడు. కొన్ని రోజుల క్రితం డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో నుంచి వెళ్లిన రామ్మోహన్ తిరిగి ఇంటికి రాలేదని, ఫోన్ చేస్తే కొత్తగూడెం వెళ్తున్నానని చెప్పినట్లు అతడి భార్య రాజకుమారి శుక్రవారం ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ బుచ్చి నాయుడు తెలిపారు.



## రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 16: పెద్దపల్లి మండలంలోని భోజన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలోని త్రివేణి రైస్ మిల్లులో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఫైర్‌స్టేషన్ అధికారి రాజేందర్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అయినా మంటలు అదుపులోకి రాకపోవడంతో గోదావరిఖని ఫైర్ ఇంజన్‌ను రప్పించారు. సుమారు రెండు గంటల పాటు మంటలను అదుపులోకి తీసుకోచ్చే ప్రయత్నం చేశారు. ఎంత నష్టం వాటిల్లింది అనేది తేల లేదని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.


ధాన్యం పంచులను బయటకు తెస్తున్న స్థానికులు

## వాహనాల తనిఖీల్లో గంజాయి పట్టివేత

గొల్లపల్లి, ఆగస్టు 16: జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు పెగడపల్లి గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేస్తుండగా శుక్రవారం సాయంత్రం ఐదుగురు అనిమానిత వ్యక్తుల నుంచి 200 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు పెగడపల్లి ఎస్సై కిరణ్ తెలిపారు. పెగడపల్లి గ్రామానికి చెందిన మల్యాల అజయ్ వద్ద గంజాయిని కొనుగోలు చేసిన జగిత్యాల పరిసర ప్రాంతాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై పెగడపల్లి నుంచి బతికపల్లి రోడ్డు మీదుగా వెళ్తుండగా డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి ఆధ్వర్యంలో పెగడపల్లి ఎస్సై కిరణ్ పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలను, ఐదు సెల్‌ఫోన్‌లను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి ఉన్నారు.

## అదృశ్యమైన యువకుడి ఆచూకీ లభ్యం



పోలీసుల అదుపులో గంగరాజు

చందుర్తి, ఆగస్టు 16: చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామంలో అదృశ్యమైన ఎక్కలదేవి గంగరాజు అనే యువకుడి ఆచూకీ శుక్రవారం ఉదయం లభించింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎక్కలదేవి గంగరాజు గురువారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో తన ద్విచక్ర వాహ నంపై వివాదంలో ఉన్న భూమి వద్దకు వెళ్లి అదృశ్యమవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. కాగా శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని ఒర్రె ప్రాంతంలో కొబ్బరి తాళ్లతో కాళ్లు, చేతులు కట్టేసి ఉండి, అరుస్తున్న గంగరాజును గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన చేరుకుని గంగరాజును అదుపులోకి తీసు కొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై విచారణ చేపడుతు న్నామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గంగరాజును ఎవరు, ఎందుకోసం పట్టుకెళ్లి తాళ్లతో బంధించి వదిలేశారు అనేది మిస్టరీ వీడాల్సి ఉంది. కాగా అదృశ్యమైన గంగరాజు ఆరుగురు వ్యక్తులు వచ్చి తనపై దాడి చేసి ముసు గు కప్పి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారని, తన నోట్లో టవల్ పెట్టడంతో ఊపిరి ఆడక స్పృహ తప్పి పడిపోయానని, శుక్రవారం ఉదయం గ్రామ శివారులో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు తాళ్లతో కాళ్లు, చేతులు బంధించి వదిలి వెళినట్లు పోలీసులకు తెలిపినట్లు సమాచారం

## ఉరివేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 16: సిరిసిల్ల పట్టణంలోని అంబికానగర్‌కు చెందిన సిరిమల్లే లక్ష్మీనారాయణ(70)శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంబికానగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ పవర్‌లూం కార్మికుడిగా పనిచేసే వాడు. అతడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. భార్య, పెద్ద కుమారుడు గతంలోనే మృతిచెందారు. చిన్నకుమారుడి వద్ద ఉంటున్న లక్ష్మీనారాయణ వయస్సు భారంతో పని చేయలేక పోతన్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. రోజు విధంగానే మదం తాగి అదే మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నారు. తన తండ్రి మద్యం మత్తులోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుమారుడు రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

## అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య



దేవేందర్‌రెడ్డి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 16: అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నేవూరి దేవేందర్‌రెడ్డి (52) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. దేవేందర్‌రెడ్డి వ్యవసాయం చేయడంతో పాటు గత 20 ఏళ్లుగా బీజేపీలో కొనసాగుతున్నారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆసుపత్రుల్లో చూపించిన నయం కాలేదు. దీంతో పాటు మద్యం తాగుతుండే వాడు. ఇంట్లో గొడవలు చోటు చేసుకుంటుండడంతో స్థానికంగా అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన భార్య నర్మద సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక మండలం రాజక్కపేటలోని తన తల్లిగారింటికి వెళ్లింది. అక్కడ నుంచే నిత్యం ఎల్లారెడ్డిపేటకు వస్తూ విధులు నిర్వహిస్తున్నారు.

ఇంటిలో ఒంటరిగా ఉంటున్న దేవేందర్‌రెడ్డి మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య నర్మద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు. మృతుడికి భార్య నర్మద, కొడుకు, కూతురు, తల్లి ఉన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, ఉపాధ్యక్షుడు రాజులతో పాటు ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు దేవేందర్‌రెడ్డి మృతదేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులు అర్పించారు. అనంతరం అంత్యక్రియాల్లో పాల్గొన్నారు.

# అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య



భాను (ఫైల్)

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 16: సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన కొండ భాను (40) అనే ఆటో మొబైల్ స్టోర్ యజమాని అప్పుల బాధతో షాప్‌లోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన పవర్‌లూం యజమాని కొండ నారా యణ కుమారుడు భాను కొత్తచెరువు కింద ఆటోనగర్‌లో శ్రీకమల్ ఆటోమొబైల్ స్టోర్‌ను పదేళ్ల క్రితం నెలకొల్పాడు. భానుకు ఆరేళ్ల క్రితం దీప్తితో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. శుక్రవారం ఉదయం భార్యకు చెప్పి ఇంటినుంచి షాప్‌కు వెళ్లాడు. షాప్‌కు వెళ్లి వచ్చేవరకు పిల్లలను అమ్మమ్మ ఇంట్లో దించివచ్చేందుకు రెడీ ఉంచమని చెప్పాడు. మధ్యాహ్నమైన భాను రాకపోవడంతో భార్య ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయలేదు. ఇంట్లోకి వెళ్లి చూడగా దండెం కట్టిన నైలాన్ తాడు కనిపించలేదు.

దీంతో అనుమానం వచ్చిన భార్య వెంటనే ఆమె మరిదికి ఫోన్‌చేసి అన్న ఇంటికి వస్తానని చెప్పి వెళ్లి రాలేదని చెప్పింది. ఆమె మరిది మరో ఇద్దరు కలిసి ఆటోమొబైల్ స్టోర్‌కు వెళ్లి షటర్ పైకి లేపి చూశారు. భాను ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఆటో మొబైల్ స్టోర్‌లో గత కొంతకాలంగా సక్రమంగా అమ్మకాలు లేవని, ఆర్థిక ఇబ్బందులు ఏర్పడడంతో తన భర్త భాను ఆత్మహత్యకు పాల్పడ్డాడని భార్య దీప్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టు మార్టంకోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

### ఆర్థిక ఇబ్బందులతో డిష్ ఆపరేటర్..

**కరీంనగర్ క్రైం:** నగరంలోని భగత్‌నగర్‌కు చెందిన డిష్ ఆపరేటర్ గీకురు మిథున్ కుమార్(35) ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలిపారు. మిథున్‌కుమార్ డిష్‌ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. భగత్‌నగర్‌లో నివాసం ఉంటున్న మిథున్‌కుమార్ ఆర్థిక బ్బందులతో బాధపడుతూ మద్యానికి బానిసగా మారాడు. మిథున్ భార్య, రెండు మూడు రోజుల కిందట తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. ఒంటరిగా ఉన్న మిథున్‌కుమార్ శుక్రవారం ఉదయం 5:41 గంటలకు భార్యకు వాట్సాప్‌లో 'సారీ మళ్లీ జీవితం ఉంటే మా బంగారు తల్లుల (కూతుళ్లు) కడుపులో పుడతా' అంటూ మెస్సేజ్ పెట్టాడు.

మెస్సేజ్‌ను చూసిని అతని భార్య మౌనిక వెంటనే పిల్లలతో కలిసి భగత్‌నగర్ ఇంటికి వచ్చి చూసేసరికి మిథున్‌కుమార్ గది తలుపులు బిగించుకుని ఉన్నాడు. స్థానికుల సహకారంతో బలవంతంగా తలుపులు తెరిచేసరికి ఉరికి వేళా డుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చగా వైద్యులు పరీక్షించి మరణించినట్లు వెల్లడించారు. ఆర్థిక ఇబ్బం దులతో తాగుడకు బానిసగా మారి జీవితంపై విరక్తి చెంది తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య మౌనిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. మిథున్ కుమార్‌కు 7, 5 సంవత్సరాల వయస్సు కలిగిన ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి

## కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 7,741 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి ఒక మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.913 టీఎంసీల నీళ్లున్నాయి. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక వరద తగ్గుముఖం పట్టడంతో కేవలం ఒక మోటార్ నుంచే నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద పెరిగి అవకాశాలున్నాయి. దీంతో శనివారం మరో మోటారును ఆన్ చేసే సూచనలు కనబడుతున్నాయి.

## శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

### కాకతీయ కాలువకు పెరిగిన నీటి విడుదల

జగిత్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో రావడం శుక్రవారం కొనసాగింది. వానాకాలం పంటల సాగు కోసం ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీలోకి 10,680 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 48.07 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 5,603 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

## అంబేద్కర్ విద్యా నిధికి దరఖాస్తుల ఆహ్వానం

గణేష్‌నగర్, ఆగస్టు 16: అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తు న్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి, ఉప సంచా లకులు ఎం నగైలేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను విదేశీ విద్యాలయాల్లో విద్యను అభ్యసించే ఎస్సీ విద్యార్థులు 20 లక్షల రూపాయల స్కాలర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 13వ తేదీ వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## చికిత్స పొందుతూ రైతు మృతి

శంకరపట్నం, ఆగస్టు 16: సైదాపూర్ మండలంలోని సోమారం గ్రామానికి చెందిన ఓ రైతు శంకరపట్నం మండలంలోని కేశవపట్నం శివారులో గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమారం గ్రామానికి చెందిన సుంకరి సారయ్య (60) తనకున్న మూడెకరాల భూమిలో ఒక ఎకరం భూమి అదే గ్రామానికి చెందిన పెరుమండ్ల రాజబాబు అనే వ్యక్తికి అమ్మినట్లు తెలిపారు. అతడు ఒక ఎకరం భూమికి బదులుగా మూడెకరాల భూమిని పట్టా చేసుకున్నాడని పేర్కొన్నారు. దాంతో రైతు మనస్థాపం చెంది ఈ నెల 14న మొలంగూర్ నుంచి సైదాపూర్ వెళ్లే దారిలో అరటి తోట వద్ద కేశవపట్నం శివారులో గడ్డి మందు తాగాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యు లు చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 15న అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు సుంకరి చందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

## ఆర్ఎంపీ వైద్యం వికటించి మహిళ మృతి

శంకరపట్నం, ఆగస్టు 16: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన సాయిల్ల స్వప్న (32) అనే మహిళ జ్వరంతో శుక్రవారం మృతి చెందింది. మహిళకు ఓ ఆర్ఎంపీ చికిత్స అందించగా వైద్యం వికటించి మృతి చెందిందని గ్రామస్థులు, మృతురాలి బంధువులు ఆరోపించారు. వారు తెలిపిన ప్రకారం.. స్వప్నకు జ్వరం రావడంతో రెండు మూడు రోజులుగా ఆర్ఎంపీ వైద్యం అందిస్తున్నాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. కొంత సమయం తర్వాత మృతిచెందినట్లు తెలిపారు. వైద్యం వికటించి స్వప్న మృతిచెందినట్లు గ్రామస్థులు, బాధిత కుటుంబీకులు ఆరోపించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులున్నారు.

## ప్రభుత్వాసుపత్రి సేవలు సద్వినియోగం చేసుకోవాలి





హెల్త్ డైరెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న వైద్యాధికారులు, సౌకర్యాలను తెలుసుకుంటున్న రవీందర్‌నాయక్

### రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్

కొడిమ్యాల, ఆగస్టు 16: ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్, ఫ్యామిలీ వెల్ ఫేర్ డా.. రవీందర్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హెల్త్ డైరెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ల్యాబ్, ఆసుపత్రి గదులను, ఇన్‌పేషెంట్ రూంలను, ఫార్మాసిస్ట్ రూంను పరిశీలించారు. పలువురు పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. డెలివరీలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అయ్యేలా మహిళలకు అవగాహన కలిపించాలన్నారు. అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రభలకుండా జిల్లా, మండల వైద్య అధికారులు, సిబ్బంది నిరంతరం ప్రజలకు అవగాహన కలిపిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న సేవలను గురించి, అందిస్తున్న మందులను గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు తెలుపాలని వైద్యాధికారులను, సిబ్బందిని ఆదేశించారు. డెంగ్యూ, చికెన్‌గున్యా, టైఫాయిడ్, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స ఉచితంగా లభిస్తుందన్నారు. ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్న వైద్య అధికా రులు, సిబ్బంది పని తీరుపట్ల ఫలితం బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి గదుల విస్తరణ, కొడిమ్యాల మండలానికి అంబులెన్స్ కెటాయింపు గురించి డీఎంహెచ్‌వోకు సి ఫారస్ చేశారు. మండల కేంద్రానికి అంబులెన్స్ కెటాయించాలని, ఆ సుపత్రిలో రాత్రి వేళల్లో వైద్యులను ఏర్పాటు చేయాలని బీజేపీ నాయ కుడు బోగ రాకేష్ హెల్త్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమియొద్దీన్, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డా.. శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ (ఎన్‌సీడీ) డా. అర్చన, డీపీవో (ఎన్‌హెచ్‌ఎం) డా. రవీందర్, మండల వైద్యాధికారి పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీధర్, సూపర్‌వైజర్లు మురళి, శ్రీనివాస్, వెంకటనర్సమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## 'పోపా' రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పోలు సత్యనారాయణ



నియామకపత్రాన్ని అందుకుంటున్న పోలు సత్యనారాయణ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 16: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ (పోపా) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కరీంనగర్‌కు చెందిన రిటైర్డు టీచర్, ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కరీంనగర్‌లోని పద్మశాలి భవన్‌లో జరిగిన పోపా సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు భైరి శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాలు తిరుగుతూ పద్మశాలి ఐక్యత కోసం కృషిచేయాలని అన్నారు. ఉపాధ్యాయుడిగా, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధిగా టీచర్లతో సత్సంబంధాలు కలిగి ఉన్నందున త్వరలో జరిగే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసి సత్తాచాటాలని సత్యనారాయణకు సూచించారు. రాజకీయ రంగంలో పద్మశాలీలు వెనుకబడి ఉన్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలీలు పోటీచేసి ఘన విజయం సాధించాలని, ఇందుకోసం పద్మశాలి సంఘాలన్నీ ఐక్యతగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వొల్లాల కృష్ణహరి, పోపా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎలిగేటి మల్లికార్జున్, నాయకులు మంచికట్ల రమేశ్, గోలి వినోద్‌కుమార్, ఎలిగేటి శ్రీనివాస్, పిస్కా లక్ష్మీనారాయణ, కొక్కుల గోవర్ధన్, ఆడెపు శ్రీనివాస్, దేవసాని సంపత్‌కుమార్, రుద్ర రమేశ్, దండె రాజశేఖర్, ఆదిచెర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## పోతన కాలనీలో చోరీలు

ఫైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 16: గోదావరిఖని టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతనకాలనీలోని సింగరేణి కార్మిక క్వార్టర్స్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. టుటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని 31 బ్లాక్- 427 క్వార్టర్‌లో లాగల అనిల్ ఇంట్లో తాళం పగులగొట్టి రూ.5వేల నగదు, 32 బ్లాక్‌లో నివాసముం టున్న సురేష్ ఇంట్లో 8తులాల వెండి పట్టీలు, 13వ బ్లాక్‌లో బొట్ల సంపత్‌కు చెందిన ద్విచక్ర వాహనం దొంగిలించినట్లు తెలిపారు. వీరందరూ తమ కుటుంబాలతో కలిసి ఊరికి వెళ్లారని, శుక్రవారం తెల్లవారుజామున క్వార్టర్ల తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించిన చుట్టు పక్కల వారు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. బాధితులు వచ్చి దొంగతనం జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారన్నారు. అలాగే బ్లాక్ నెం.31లో తాళం వేసి ఉన్న 426, 428, 430 క్వార్టర్లలో తాళాలు పగుల గొట్టారని, ఆయా క్వార్టర్లలో ఎవరూ నివాసముండడం లేదన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 16 : మండలంలోని కందుగుల గ్రామ శివారులో ఓ వ్యక్తి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కందుగుల గ్రామానికి చెందిన గండె శ్రీ తిరుపతి అనే వ్యక్తి గ్రామంలో తక్కువ ధరకు ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి హుజూరాబాద్ పట్టణంలోని ఓ రైస్ మిల్లులో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో రెండు బియ్యం సంచులతో ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్‌కు వస్తున్న క్రమంలో పోలీసులను చూసి పక్కగా పారిపోతుండగా పట్టుకొని విచారించినట్లు తెలిపారు. ఆ వ్యక్తిని బియ్యం అమ్మిన మిల్లుకు తీసుకొని వెళ్లి విచారించగా ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమైనట్లు తెలిపారు. బియ్యం విలువ రూ. 1,0800 ఉందని తెలిపారు. ఈ మేరకు సీఐ తిరుమల్ కేసు నమోదు చేసి పీడీఎస్ బియ్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

## ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి

### ఆలయాల్లో ఉద్యాపన, కుంకుమ పూజలు



గోదావరిలో భక్తుల స్నానాలు

ధర్మపురి, ఆగస్టు 16: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో రెండవ శుక్రవారం భక్తజన సందడి నెలకొంది. వరలక్ష్మి శుక్రవారం కూడ తోడు కావడం వల్ల అనేక మంది భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. మహిళలు తమ ఇళ్లలో వరలక్ష్మి వ్రతాలు ఆచరించారు. అలాగే గోదావరి నదీ తీరాన గల సంతోషీమాత, మహాలక్ష్మి, వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయాల్లో ఉపా వాస దీక్షతో ఉన్న మహిళలు ఉద్యాపన పూజలు, కుంకుమ పూజలు జరిపారు. మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి మణిదీప వర్ణన పూజ, లలిత, మహాలక్ష్మి అష్టోత్తరం, పంచామృతాభిషేకం, హారతి పూజలు చేసి నివేదన సమర్పించారు. ఆలయ అర్చకులు కొరిడె బాలక్రిష్ణ, మధ్వాచారి రాంకిషన్ అందంగా అలంకరణ చేసిన అమ్మవారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.



మహాలక్ష్మి దేవాలయంలో మహిళల కుంకుమ పూజలు

## ఆదివరాహస్వామి జయంత్యుత్సవాలు ప్రారంభం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కమాన్‌పూర్, ఆగస్టు 16 : మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి జయంత్యుత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారి వద్ద నిత్యాభిషేకం, గోపూజ, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు భారీఎత్తున హాజరయ్యారు. ప్రధాన ఆచార్యులు వరప్రసాద్ ఆధ్వర్యంలో పూజలను నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. అలాగే కార్యనిర్వహణాధికారి కాంతరెడ్డి భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రానికి చెందిన మాదాసు రవీందర్ దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

# ఖనిలో విజృంభిస్తున్న జ్వరాలు

● కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 16: వర్షాకాలం సీజన్ కావడంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రోజురోజుకు డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఖాళీ స్థలాల్లో ఇండ్ల చుట్టూ భారీ వర్షాలతో నీరు చేరడంతో దోమలు, ఈగల వ్యాప్తి పెరిగి విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇంట్లో ఒకరికి జ్వరం వస్తే ఇంటిల్లిపాది మొత్తం జ్వరం బారిన పడుతున్నారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోజుకు వందల సంఖ్య జ్వరబాధితులు వస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా చాలామంది జ్వర బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. పగటి దోమలు సంచారం పెరగడంతో చాలా మంది డెంగ్యూ బారిన పడుతున్నారు. అత్యధికంగా డెంగ్యూ కేసులు నమోదు అవుతున్నాయి. జ్వరం సోకిన రెండు రోజులకే ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. ప్లేట్‌లెట్ల సంఖ్య పడిపోవడంతో చాలా మంది హైదరాబాద్, కరీంనగర్ వంటి పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోజుకు 800 నుంచి 1000వరకు ఓపీ కేసులు వస్తుండగా అందులో టైఫాయిడ్, మలేరియా బాధితులే ఎక్కువ మంది ఉండడం గమనార్హం. చిన్నపిల్లల్లో బ్లడ్ ఇన్‌ఫెక్షన్ సోకి పిల్లలు నీరస పడిపోవడం హైఫీవర్ పెరిగిపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇంట్లో ఒకరికి జ్వరం వస్తే ఒకరి



ఆసుపత్రికి వచ్చిన రోగులు

నుంచి ఒకరికి వేగంగా సోకుతోంది. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వఉండడంతో దోమల వ్యాప్తి పెరిగిపోతోంది. ప్రతి వర్షాకాల సీజన్‌లో ఖాళీ స్థలాల్లో దోమల వ్యాప్తి పెరగకుండా ఆయిల్ బాల్స్ వేసే వారు. కానీ కార్పొరేషన్‌లో ఆయిల్ బాల్స్ కానీ, దోమల మందు కానీ పిచికారి చేయడం లేదు. రాత్రి వేళల్లో ఆయా కాలనీల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ యంత్రాల ద్వారా దోమల మందు చల్లాల్సి ఉండగా అది కూడా చేయడం లేదు. దీంతో రోగాలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి.

### కానరాని ఇంటింటా జ్వరం సర్వే..

గోదావరిఖనిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ల ఆధ్వర్యంలో ఇంటింటా జ్వర సర్వే నిర్వహించాల్సి ఉండగారామగుండం కార్పొరేషన్‌లో మాత్రం ఇప్పటి వరకు సర్వేను మొదలు పెట్టలేదు. ప్రాథమిక వైద్యకేంద్రాల ఆధ్వర్యంలో సర్వే చేయాల్సి ఉండగా ఇక్కడ మాత్రం నిర్వహించడం లేదు. దాదాపు పది అర్బన్ సెంటర్‌లు ఉన్నా రామగుండం కార్పొరేషన్‌లో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లతో ఇంటింటికి వెళ్లి ఇంట్లో ఎవరు జ్వరంతో బాధపడుతున్నారు, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. అలాంటి సర్వే చేపట్టకపోవడం, అవగాహన కల్పించకపోవడంతో పారిశ్రామిక ప్రాంతంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికైనా ఇంటింటా జ్వర సర్వే నిర్వహించి రోగాలు రాకుండా నివారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

### ప్రమత్తంగా ఉండాలి...

- డాక్టర్ రాజశేఖర్, ఎండీ ఫిజిషియన్



వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. వర్షాలు పడుతున్నందున నీరు కలుషితమయ్యే అవకాశాలున్నాయి. నీటిని కాచి వడపోసిన తరువాతే తాగాలి. బయట ఆహార పదార్థాలను తీసుకోకూడదు. వేడి ఆహార పదార్థాలు తినాలి. ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా చూసుకోవాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. జ్వరం, జలుబు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలి.

## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



రైతు రుణమాఫీ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

ఎలిగేడు, ఆగస్టు 16: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం రైతు రుణమాఫీపై సంబరాలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా వచ్చి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రెండులక్షల రుణమాఫీ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా హైస్కూల్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ఏర్పాటు చేసిన ర్యాలీలో ఎడ్ల బండిపై ప్రయాణించారు. రైతుల తరుపున సీఎం రేవంత్‌రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆమ రాజేశ్వర్ రెడ్డి, నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, తాటిపల్లి రమేష్‌బాబు, బూర్ల వెంకటసత్యం, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, నరహరి సుధాకర్‌రెడ్డి, గోడెల శ్రీనివాస్‌రెడ్డి, ఒద్దినేని వామన్‌రావు, కొండ తిరుపతిగౌడ్, పుల్లారావు, కొప్పర తిరుమల్‌రెడ్డి, అనిల్‌రావు, అమ్ముల రాజు, పల్లెర్ల వెంకటేష్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

### 22న జాబ్ మేళా

పెద్దపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువకులకు పెద్దపల్లిలోని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 22న పెద్దపల్లిలోని ప్రభుత్వ ఐటిఐ కేంద్రంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై తిరుపతి రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ పెద్దపల్లిలో 20 మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, ఏదైనా డిగ్రీ లేదా ఎంబీఏ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. వయస్సు 25 నుంచి 32 ఏళ్ల లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి, సంబంధిత విద్యార్హత కలిగిన వారు ఆగస్టు 22న ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూ కోసం సర్టిఫికేట్స్ జిరాక్స్‌లతో ఐటీఐ కేంద్రానికి వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8985336947, 8121262441 నందు సంప్రదించాలని ప్రకటనలో తెలిపారు.

### 20న బీసీ సదస్సుకు తరలిరావాలి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 16: ఈనెల 20న పెద్దపల్లిలోని ఎంబీ గార్డెన్‌లో బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఉన్న యాదవులు, యాదవ యువత పెద్ద సంఖ్యలో బీసీ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ స్టేట్ కౌన్సిల్ మెంబర్ శిలారపు పర్వతాలు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, బత్తిని లక్ష్మణ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

### మాదిగ శక్తి నియోజకవర్గ అధ్యక్షుడిగా మొగిలి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 16: మాదిగ శక్తి మంథని నియోజకవర్గ అధ్యక్షుడిగా రామగిరి మండలం బేగంపేట్‌కు చెందిన మడిపెల్లి మొగిలిని నియామకం చేసినట్లు జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి రవి తెలిపారు. ఈమేరకు శుక్రవారం మాదిగ శక్తి వ్యవస్థాపకుడు సురేందర్ నస్నీ తో కలిసి మొగిలికి రవి పెద్దపల్లిలో నియామక పత్రం అందజేశారు. మాదిగలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణించాలని, ఆర్థికంగా ఎదిగేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మాదిగలకు పిలుపునిచ్చారు. తన నియామకానికి సహకరించిన నస్నీ, రావిలకు మొగిలి కృతజ్ఞతలు తెలిపారు.

### రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 16: విద్యుత్ సంస్థ ఎన్పీడీసీఎల్‌ను అదాని గ్రూపునకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యం రావు ప్రభుత్వానికి సూచించారు. ఈ సందర్భంగా కరపత్రాలు ఆవిష్కరించిన అనంతరం ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ ఎన్పీడీసీఎల్‌ను అదాని గ్రూపునకు అప్పగించాలని, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమైందని, దీన్ని రాష్ట్రంలోని ప్రజలందరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్, భిక్షపతి, సహాయ కార్యదర్శి ఎస్ రవీందర్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి వాగు నాయక్, ప్రధాన కార్యదర్శి సీహెచ్, నరసయ్య, ఉప్పు జగన్, కాలువ బాలయ్య, బండ సదానందం, సోగాల అశోక్, గంధం విజయ్ పాల్గొన్నారు.

### గిరిజన బాలికల ఆశ్రమ కళాశాల తనిఖీ

మంథని, ఆగస్టు 16: స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాలను మంథని ఆర్డీవో హనుమానాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. కిచెన్, బాత్‌రూంలను, స్టాక్, స్టాఫ్ రికార్డులను ఆయన పరిశీలించారు. కళాశాల విద్యార్థులు వచ్చేలా తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అదించాలని సూచించారు. వర్షాకాలం కావడంతో కళాశాల అవరణను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీలత, వార్డెన్ విశ్వశాంతి పాల్గొన్నారు.

### కాల్వశ్రీరాంపూర్‌లో భారీ వర్షం

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు16: మండల కేంద్రంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై వరద నీరు నిండి ఉండడంతో గ్రామస్థులు ఇబ్బంది పడ్డారు. మండల కేంద్రంలో శుక్రవారం అంగడి కావడంతో ఇంటి వద్ద నుంచి అంగడికి వచ్చిన మహిళలు, గ్రామ ప్రజలు వారింటికి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. రోడ్లమీద నీరు నిలిచి చెరువులను తలపించాయి. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షం నీరు అంతా రోడ్ల మీద నిలవడంతో గ్రామస్థులు నడవడానికి ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికే రోగాలతో సతమతమవుతున్న గ్రామ ప్రజలు రోడ్లపై వర్షపు మురికినీరు నిల్వలు ఏర్పడి దోమలు మరింత వ్యాప్తి చెందే అవకాశం ఉంది. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రామగిరి, ఆగస్టు 16: మండలంలోని కల్వచర్ల, లొంకకేసారం గ్రామాల్లో అనారోగ్యంతో వైద్య చికిత్స పొందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేపట్టారు. కల్వచర్ల, లొంకకేసారం గ్రామాలకు చెందిన 18 మందికి ప్రభుత్వం నుంచి రూ. 5,67,500 విలువైన చెక్కులను ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు పీఏ చంద్రశేఖర్ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు కొలిపాక సారయ్య, నాయకులు వీరవేని శ్రీనివాస్, కొట్టే సందీప్, ముచ్చకుర్తి శ్రీనివాస్, రొడ్డసంపత్, ఈరు రాజయ్య, పంచాయతీ సెక్రటరీ శ్రీధర్, కురుమాల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు పనులు ప్రారంభం

కాల్వ శ్రీరాంపూర్, ఆగస్టు 16: మండలంలోని మొట్లపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి మానేరుకు వెళ్లే రహదారి పనులను శుక్రవారం మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాలకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే విజయరమణారావుకు విన్నవించగా స్పందించిన ఎమ్మెల్యే ఎస్‌డీఎఫ్ నిధులతో మరమ్మతులు చేయిస్తున్నట్లు ఆయన తెలిపారు. రహదారి పనులు పూర్తయిన తర్వాత సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల ద్వారా పనుల ఎస్టిమేట్ వేయించి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయనున్నట్లు సారయ్యగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు గోనె శ్యామ్, కోమాల మల్లమ్మ, నాయకులు శ్రీపతి రాజ్ కుమార్, రాంప్రసాద్, ఐలయ్య, శ్రీనివాస్, లింగయ్య, సంపత్, హరీష్ పాల్గొన్నారు.

### బంద్‌ను జయప్రదం చేయండి

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 16: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శనివారం చేపట్టే గోదావరిఖని పట్టణ బంద్‌ను విజయవంతం చేయాలని బీజేపీ రామగుండం ఇంచార్జీ కందుల సంధ్యారాణి ఒక ప్రకటనలో కోరారు. బంగ్లాదేశ్‌లో దాడులు, హత్యలకు నిరసనగా హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గోదావరిఖనిలో తలపెట్టిన బంద్‌లో వ్యాపారస్తులు, విద్యాసంస్థలు, అన్నివర్గాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## రామగుండం మెడికల్ కళాశాలలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 16: రామగుండం మెడికల్ కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిలో 141 ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు, ట్యూటర్ల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానించినట్టు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు ఒక ప్రకటనలో తెలిపారు. అనాటమిలో అసోసియేట్ ప్రొఫెసర్లు-2, అసిస్టెంట్లు ప్రొఫెసర్లు-2, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-3, ట్యూటర్లు-4, ఫిజియాలజీలో అసోసియేట్ ప్రొఫెసర్లు-2, అసిస్టెంట్లు ప్రొఫెసర్లు-2, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-3, ట్యూటర్లు-3 భర్తీ చేయనున్నట్టు తెలిపారు. బయోకెమిస్ట్రీలో సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-2, ట్యూటర్లు-2, ఫార్మాలజీలో అసోసియేట్ ప్రొఫెసర్లు-2, అసిస్టెంట్లు ప్రొఫెసర్-1, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-3, ట్యూటర్లు-2, పాథాలజీలో ప్రొఫెసర్-1 అసోసియేట్ ప్రొఫెసర్లు-2, అసిస్టెంట్లు ప్రొఫెసర్-1, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-3, ట్యూటర్లు-2 నియమించనున్నట్టు తెలిపారు. మైక్రోబయోలజీలో ప్రొఫెసర్-1 అసోసియేట్ ప్రొఫెసర్-1, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-3, ట్యూటర్లు-3, ఫోరెన్సిక్ మెడిసిన్‌లో ప్రొఫెసర్-1, అసోసియేట్ ప్రొఫెసర్-1, అసిస్టెంట్లు ప్రొఫెసర్లు-2, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-3, ట్యూటర్లు-3, కమ్యూనిటీ మెడిసిన్‌లో ప్రొఫెసర్-1, అసోసియేట్ ప్రొఫెసర్స్-2, అసిస్టెంట్లుప్రొఫెసర్లు-3, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-3, ట్యూటర్లు-3, జనరల్ మెడిసిన్‌లో అసోసియేట్ ప్రొఫెసర్లు-2, అసిస్టెంట్లు ప్రొఫెసర్లు-3, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-5, ప్రిడియాట్రిక్‌లో సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-3, డెర్మటాజీలో ప్రొఫెసర్-1, అసోసియేట్ ప్రొఫెసర్-1, సీనియర్ రెసిడెంట్ డాక్టర్-1, జనరల్ సర్జరీలో అసోసియేట్ ప్రొఫెసర్లు-2, అసిస్టెంట్లు ప్రొఫెసర్లు-3, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-5 నియమించనున్నట్టు తెలిపారు. ఈఎన్‌టీలో ప్రొఫెసర్-1, అసోసియేట్ ప్రొఫెసర్-1, అసిస్టెంట్లు ప్రొఫెసర్-1, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-2, అర్థోపెడిక్‌లో ప్రొఫెసర్-1, అసోసియేట్ ప్రొఫెసర్-1, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-3, ఆప్తమాలజీలో ప్రొఫెసర్-1, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-2, ఫిజియోథెరపీలో ప్రొఫెసర్-1, అసోసియేట్ ప్రొఫెసర్-1, సీనియర్ రెసిడెంట్ డాక్టర్-1, గైనకాలజీలో అసోసియేట్ ప్రొఫెసర్-1, అసిస్టెంట్లు ప్రొఫెసర్లు-3, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-4, రేడియోలజీలో ప్రొఫెసర్-1, అసోసియేట్ ప్రొఫెసర్-1, అసిస్టెంట్లు ప్రొఫెసర్లు-2, సీనియర్ రెసిడెంట్‌డాక్టర్లు-3, అనస్తిషియాలో అసోసియేట్ ప్రొఫెసర్లు-2, అసిస్టెంట్లు ప్రొఫెసర్లు-2, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-4 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈనెల 26వ వరకు సింగరేణి మెడికల్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

### కార్మికులను వేధిస్తున్న హెల్త్ అసిస్టెంట్‌పై చర్య తీసుకోవాలి

కోల్‌సిటీ, ఆగస్టు 16: నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులను వేధిస్తున్న హెల్త్‌అసిస్టెంట్‌పై చర్య తీసుకోవాలని ఏఐటీయూసీ నగర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ గౌస్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దెల దినేష్ అదనపు కలెక్టర్ అరుణశ్రీని కోరారు. శుక్రవారం ఈ మేరకు ఆమెకు ఫిర్యాదు చేశారు. కార్పొరేషన్ పారిశుధ్య కార్మికుడు విజయ్‌ని వేధించడంతో అతడు ఆత్మహత్యాయత్నం చేశాడన్నారు. అతనిపై విచారణ జరిపి చర్య కోరారు. అలాగే పారిశుధ్య సొసైటీకి సంబంధించి నిధులపై విచారణ చేయాలని కోరారు.

## 'రైతు భరోసా'పై అనుమానాలు వద్దు : ఎమ్మెల్యే విజయరమణారావు



శుద్ధ జల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, ఆగస్టు 16 : రైతు భరోసా అమలుపై అనుమానాలు పెట్టుకోవద్దని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని బాయమ్మపల్లిలో శుక్రవారం బాలవికాస్ నిర్వహించే శుద్ధ జల కేంద్రాన్ని తల్లి చింతకుంట విజయలక్ష్మి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు భరోసా పథకంలో ఎన్ని ఎకరాల వరకు లబ్ధిదారులకు వర్తింపజేయాలనేది త్వరలోనే ప్రభుత్వం ప్రకటిస్తుందని తెలిపారు. అలాగే గతంలో చెరువులకు, కాల్వలకు, నదులకు, కుంటలకు, గుట్టలకు రైతు బంధు వర్తింపు జరిగిందని, దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని అప్పటి ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని తెలిపారు. భూములుండి సాగులో ఉన్న వ్యవసాయ భూములకు అలాగే నిజమైన రైతులకు రైతు భరోసా వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోబోతుందని తెలిపారు. రుణమాఫీలో సాంకేతిక లోపాలవల్ల కొందరికి రుణమాఫీ కాలేదని, వారికి కూడా మాఫీ చేస్తామని, ఆందోళన చెందవద్దని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షలతో నిర్మించే రోడ్డుకు శంకుస్థాపన చేశారు. సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పడాల రాజు, బాలవికాస్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలమోహన్‌రెడ్డి, తిప్పారపు సంపత్, గుండేటి ఐలయ్య, మాజీ ఉపసర్పంచ్ గిరాం సాంబమూర్తి, డైరెక్టర్ బొంగోని శ్రీనివాస్, మాజీ సర్పంచులు తెలుసూరి కొమురయ్య, అంకం రమేష్, పిట్టల రవికుమార్, కావటి రాజు, కాంగ్రెస్ యువజన నాయకుడు సిరిసేటి రాహుల్, రైతు మనోజ్ క్రాంతివీర్, ఆలేటి సంపత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్, రాగిడి శ్రీనివాసరెడ్డి, బాలవికాస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

### మాజీ ప్రధాని వాజ్‌పేయి సేవలు మరువలేనివి..

- బీజేపీ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 16: దేశానికి మాజీ ప్రధాని, దివంగత వాజ్‌పేయి చేసిన సేవలు మరువలేనివని బీజేపీ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య అన్నారు. వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా గోదావరిఖని శివాజీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన కింద రోడ్లను నిర్మించారని, ప్రజా సంక్షేమ పథకాలతో పాటు ఉచిత వైద్యం అందించిన ఘనత వాజ్‌పేయికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమారపు అరుణ్‌కుమార్, సుల్వ లక్ష్మీనర్సయ్య, కోదాటి ప్రవీణ్, సునీల్, సురేష్, శివరామకృష్ణ, అరవింద్, సంపత్, శ్రావణ్, రాయనర్సు, అజయ్, శివ, రాకేష్ పాల్గొన్నారు.



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

## గూడ్స్ రైలు నుంచి ఊడిపోయిన బోగీలు

ఓదెల, ఆగస్టు 16 : పెద్దపల్లి వైపు నుంచి కాజీపేట వైపు వెళ్తున్న స్టీల్ లోడ్ గూడ్స్ రైలు శుక్రవారం ఓదెల రైల్వేస్టేషన్‌లో రైలు నుండి 11 బోగీలు ఆకస్మికంగా ఊడిపోయాయి. దీంతో బోగీల చివరలో ఉన్న గార్డు వెంటనే ఇంజన్ డ్రైవర్‌లకు సమాచారం తెలుపడంతో 50 గజాల దూరంలో రైలు నిలిపివేశారు. దీంతో సంఘటనను ఉన్నత స్థాయికి తెలుపడంతో ఇతర రైల్వే స్టేషన్లలో సిబ్బంది అప్రమత్తమై వచ్చే రైళ్లను ఎక్కడికి అక్కడే నిలిపివేశారు. బోగీల మధ్య ఉన్న లింకులను సరిచేయకుండా అధికారులు పరిశీలించకుండా రైలును పంపించడంతో ఈ సంఘటన జరిగి ఉంటుందని కొందరు సిబ్బంది విలేకరులకు తెలిపారు. ఒకవేళ రైలు వేగంగా వెళ్తున్న క్రమంలో బోగీలు ఊడిపోతే ప్రమాదం జరిగి ఉండేదని కొందరు సిబ్బంది తెలిపారు. గంట అనంతరం ఓదెల స్టేషన్‌లో నిలిపివేసిన రైలు నుంచి విడిపోయిన బోగీలను సరిచేసుకొని రైలును కాజీపేట వైపు పంపించారు.

కాగా, రైల్వే అధికారుల నిర్లక్ష్య విధుల వల్ల రైలు నుంచి బోగీలు ఊడిపోయి ఉంటాయని, రైలును పంపించే ముందు బోగీలను తనిఖీ చేయాల్సిన అధికారులు సక్రమంగా పరిశీలించకపోవడంతో ఈ సంఘటన జరిగి ఉంటుందని ఒక అధికారి పేర్కొనడం కొసమెరుపు.

### ఎన్టీపీసీ సీఎస్ఆర్ ప్రోత్సాహకాల పంపిణీ

జ్యోతినగర్, ఆగస్టు 16 : ఎన్టీపీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో శుక్రవారం లబ్ధిదారులకు ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. అలాగే ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతాల మహిళలకు 3నెలల ఉచిత కుట్టు శిక్షణ, బ్యూటీషియన్ కోర్సులపై శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఎన్టీపీసీ దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు చిన్మయిదాస్ శిక్షణా తరగతులను ప్రారంభించారు. బాలికా సాధికారత మిషన్ (జెమ్)లో శిక్షణ పొందన బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలలకు చెందిన మెరిట్ విద్యార్థులకు ఉపకారవేతనాలను పంపిణీ చేశారు. ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్ఆర్) విజయ్‌కుమార్ సిక్దర్, మహిళా సమితి సభ్యులు జ్యోత్స్న త్రిపాఠి, రూప సింఘనాచ తదితరులు పాల్గొన్నారు.

### గడువు పొడిగింపు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 16: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఓపెన్ డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరంలోకి ప్రవేశాలను ఈనెల 31వ తేది వరకు పొడిగించారని గోదావరిఖని అధ్యయన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.సుబ్బారావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై.కిషన్‌ఓజా ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఇంటర్మీడియట్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్మీడియట్, డిప్లమా, పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు నేరుగా అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు. వివరాలకు కళాశాలలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని వారు కోరారు.

### నియామకం

సుల్తానాబాద్, ఆగస్టు 16: సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర వైస్‌చైర్మన్‌గా సుల్తానాబాద్ మండలం సాంబయ్యపల్లి గ్రామానికి చెందిన కస్తూరి లక్ష్మారెడ్డిని నియమించినట్టు చైర్మన్ నోముల సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు కన్న రమేష్‌గౌడ్ అభినందనలు తెలిపారు.

### ప్రభుత్వాస్పత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 16 : ప్రభుత్వ ఐటీఐ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వాస్రతిల్లో పండ్లు బెడ్లు పంచి పెట్టారు. అన్నేడ వెంకటరెడ్డి, ధరణి సతీష్, చింతపండు లక్ష్మయ్య గొల్లపల్లి శంకరయ్యల సహకారంతో కార్యక్రమం చేపట్టారు. అధ్యక్షుడు కొమ్ము జగన్, ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, సంపత్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, కొట్టె లక్ష్మయ్య, రాజమౌళి, దశరథం, వెంకటేశం పాల్గొన్నారు.

### బస్టాండ్‌లో సమస్యలు పరిష్కరించాలి

మంథని, ఆగస్టు 16: స్థానిక బస్టాండ్‌లో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాలని డీఎంకు వినతి పత్రాన్ని ఇచ్చినట్లు పెండ్రు సుమంత్‌రెడ్డి, సోంపల్లి నారాయణరావు, ముస్కుల జితేందర్‌రెడ్డిలు శుక్రవారం తెలిపారు. ప్రయాణీలకు రద్దీకి తగ్గట్లు సౌకర్యాలు లేవన్నారు. సీసీ కెమెరాలు పని చేయడం లేదన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

మార్కండేయకాలనీ, ఆగస్టు 16: ఇటీవల మరణించిన సీనియర్ జర్నలిస్టు నాయిని మధునయ్య కుటుంబాన్ని శుక్రవారం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధానకార్యదర్శి మారుతిసాగర్ పరామర్శించారు. మధునయ్య సతీమణి విజయకుమారి, కుమారులు హరీష్, హరిదీప్‌లను ఓదార్చారు. అనంతరం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వారి వెంట పెద్దపల్లి జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు తదితరులు ఉన్నారు.

### బీసీ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

కమాన్‌పూర్, ఆగస్టు 16 : మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బీసీ సంఘం మండల అధ్యక్షుడు నవీన్ ఆధ్వర్యంలో బీసీ సదస్సుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది.

ఈ కార్యక్రమంలో బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు తగరం శంకర్‌లాల్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, బీసీ నాయకులు మచ్చగిరి రాము, శంకర్‌గౌడ్, మేకల సం పత్ యాదవ్, బూమయ్య, ఉప్పరి శ్రీనివాస్‌యాదవ్, బోనా ల వెంకటస్వామి గుర్రలక్ష్మీమల్లు, ఇదారపు మల్లయ్య, చిం దం తిరుపతి, బొమ్మగాని అనిల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# హిందూ ఐక్య వేదిక బంద్ సంపూర్ణం



సుల్తానాబాద్‌లో మూసి ఉన్న వ్యాపార సంస్థలు



ధర్మారంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సుల్తానాబాద్, ఆగస్టు 16: బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ దేవాలయాలపై దాడులు, హింసను ఖండిస్తూ హిందూ ఐక్య సంఘాల పిలుపు మేరకు సుల్తానాబాద్‌లో బంద్ నిర్వహించారు. శుక్రవారం వ్యాపారులు, వాణిజ్య సంస్థల వారు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. వరలక్ష్మి శుక్రవారం కావడంతో పూలు పండ్లు, పూజా సామగ్రి కోసం మార్కెట్‌కు వచ్చినా బంద్ ఉండడంతో వెనుతిరిగి వెళ్లారు. అక్కడక్కడా తెరిచిఉన్న దుకాణాలను చిరువ్యాపారులను హిందు సంఘాల ప్రతినిధుల సూచనలతో బంద్ చేశారు. బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షులు కూకట్ల నాగరాజు, హిందు ఐక్య సంఘాల ప్రతినిధులు చిట్టవేని సదయ్య, గజభీంకార్ పవన్, ఎనగందుల సతీష్, తుమ్మ రాజ్‌కుమార్, పల్లె తిరుపతి, మహేష్, కామని రాజేంద్ర ప్రసాద్, తుమ్మ నిశాంత్, నార్ల శ్రీనివాస్, బుర్ర సతీష్, కొల్లూరి సంతోష్, సోడా శ్రీను, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

**కాల్వశ్రీరాంపూర్** : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మండల కేంద్రంలో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా బంద్ పాక్షికంగా జరిగింది. కొద్దిసేపు బంద్ పాటించి యథావిధిగా వాణిజ్య, వ్యాపార, హోటల్స్, కూరగాయలు తదితర దుకాణాలు నడిచాయి. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ కుమార్, చల్లచంద్రమౌళి, పూరెల్ల దిలీప్, రామన్న, వెంకటేశ్వర్లు, శివ, దంతనపల్లి కృష్ణ లక్ష్మణ్, శ్రావణ్, మల్యాల రమేష్, కారుపాకల శంకర్, దాసరి కృష్ణ, తాత రాజు, పంజాల సతీష్, ఉల్లి రమేష్, బంగారి సతీష్, ముస్కు విజయ్, శ్రీకాంత్, హిందూ సంస్థల నాయకులు పాల్గొన్నారు.

**ధర్మారం** : బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ శుక్రవారం హిందూ ఐక్య వేదిక పిలుపు మేరకు ధర్మారంలో బంద్ విజయవంతమైంది. వాణిజ్య వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశారు. బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు గుజ్జుల వేణుగోపాల్‌రెడ్డి, కన్నం అంజయ్య, ధర్మపురి నియోజకవర్గ కన్వీనర్ రాజబాబు, కిసాన్ మోర్చా కన్వీనర్ తీగుల్ల సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఓదెల** : హిందూ ఐక్యవేదిక ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం మండల వ్యాప్తంగా బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా హిందూ వాహిని, బీజేపీ నాయకులు నినాదాలు చేస్తూ, బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, హత్యలపై నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంతో పాటు కొలనూర్, కనగర్తి, పొత్కపల్లి తోపాటు తదితర గ్రామాల్లో వ్యాపార, వాణిజ్య సంస్థలు బందు పాటించాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ, హిందూ వాహిని నాయకులు దాత రాకేష్, తీర్థాల కుమార్, చందు, సతీష్, రామినేని రాజేంద్రప్రసాద్, ముంజాల మధు, రామినేని శివ, కందునూరి సాయి వర్షిత్, కుమార్, ఆది భరత్, వీర్ల శివ, చెరుకు తోట నాగేష్, గణేష్, వేల్పుల నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

**రామగిరి** : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలకు నిరసనగా శుక్రవారం మండలంలో వర్తక, వాణిజ్యవ్యాపారులు స్వచ్ఛంధంగా బంద్ పాటించారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసకాండను ఆపాలంటూ బంద్ చెపట్టారు. మండలంలోని పేట్రోల్‌బంక్‌లు, బ్యాంకులు, వైన్స్‌షాప్‌లు బంద్‌ను పాటించారు. హిందువుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మోల్మూరిశ్రీనివాస్, తీగల శ్రీధర్, శ్రీకాంత్,కందుల రమేశ్, మహేష్‌బాబు, రాజబాబు, రంజిత్, ఎండీ జానీలు డిమాండ్ చేశారు.

**ఎలిగేడు** : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలకు నిరసనగా శుక్రవారం హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ ఎలిగేడులో సంపూర్ణంగా జరిగింది. వాణిజ్య వ్యాపారవేత్తలు, చిరు వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు కోదాటి వెంకటరమణారావు, ఆసంపల్లి రవి,వంగ శ్రీధర్, సతీష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

**జ్యోతినగర్** : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం బంద్ జరిగింది. ఈ ప్రాంతంలోని అన్ని దుకాణాలు, వ్యాపార సంస్థలను మూసివేశారు. వేదిక నాయకులు వీధుల్లో తిరుగుతూ తెరిచి ఉన్న షాపులను మూసివేయించారు. బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిందువులపై జరుగుతున్న దాడులను ఆపాలని నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు రావికంటి వరప్రసాద్, తిరుపతి, సత్యనారాయణ, బండి తిరుపతి, సతీష్‌కుమార్, సంతోష్‌రెడ్డి, నర్సింగ్, అనిల్, నాగరాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.